క్లుప్తంగా

ఆటో అపహరణ

నెల్లూరు(క్రైమ్‌): రహదారిపై ఆటోను నిలిపి టీ తాగొచ్చేలోపు గుర్తుతెలియని దుండగులు అపహరించిన నగరంలోని బాబూ ఐస్‌క్రీమ్స్‌ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. కోవూరు మండలం పోతిరెడ్డిపాళేనికి చెందిన షఫీ నగరంలోని వీఆర్సీ సెంటర్‌ నుంచి ఆత్మకూరు బస్టాండ్‌ వరకు ఆటోను నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు బస్టాండ్‌కు మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో బయల్దేరారు. మార్గమధ్యలో బాబూ ఐస్‌క్రీమ్స్‌ వద్ద ఆటోను నిలిపి టీ తాగేందుకు ఎదురుగా ఉన్న కేఫ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్‌): ఆటో డ్రైవర్‌ అదృశ్యమైన ఘటనపై కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న మల్లికార్జున అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో భార్య రాజేశ్వరితో కలిసి స్టోన్‌హౌస్‌పేటలోని తన మేనత్త ఇంటికి ఈ నెల ఎనిమిదిన వెళ్లారు. ఇప్పుడే వస్తానంటూ బయటకెళ్లిన ఆయన జాడ తెలియరాలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లో అవార్డుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): సాహిత్యంలో విశేష కృషి చేసిన సాహితీవేత్తలకు అవార్డులను నగరంలో వచ్చే నెల్లో అందజేయనున్నామని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్‌ చైర్మన్‌ చిన్నినారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి ప్రసాదమూర్తికి చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్‌ అవార్డును అందజేయనున్నామని వివరించారు. అదే విధంగా పలువురికి పురస్కారాలను ప్రదానం చేయనున్నామని చెప్పారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్‌

నెల్లూరు(క్రైమ్‌): కొత్తకాలువ సెంటర్‌ వద్ద అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న అదే ప్రాంతానికి చెందిన ఫణీంద్రను ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ నెల్లూరు – 1 అధికారులు అరెస్ట్‌ చేశారు. అతని నుంచి పది క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం చేస్తున్న ఐదుగుర్ని అరెస్ట్‌ చేశారు. ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌ బాబు, ఎస్సై మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి : ఆర్జేడీ

నెల్లూరు(పొగతోట): అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించి పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ ఎస్‌.జయలక్ష్మి సీడీపీఓలను ఆదేశించారు. బుధవారం నెల్లూరులోని ఐసీడీఎస్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, చిన్నపిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. సీడీపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నాణ్యత లోపించిన సరుకులు సరఫరా చేస్తే వెంటనే వాటిని వెనక్కు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులకు గైర్హాజరైన సమయంలో మాత్రమే వారి వేతనాలు కట్‌ చేయాలన్నారు. సమావేశంలో ఐసీపీఎస్‌ అధికారి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ సీనియర్‌ అసిస్టెంట్‌ బదిలీ

నెల్లూరు(అర్బన్‌): నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్షద్‌ను కలెక్టర్‌ ఆనంద్‌ ఆదేశాల మేరకు బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను ఆర్డీఓ అనూష జారీ చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఉదయగిరి మండలానికి బదిలీ చేశారు.

15న అగ్రిగోల్డ్‌ భూములను పరిశీలించనున్న కాకాణి

ఉదయగిరి: వరికుంటపాడు మండలం కనియంపాడులోని అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూములను ఈ నెల 15న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించనున్నారని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నెల్లూరులో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌ భూముల్లోని జామాయిల్‌ను అక్రమంగా నరికి కొంతమంది నేతలు సొమ్ము చేసుకున్న నేపథ్యంలో కాకాణి క్షేత్రస్థాయిలో అక్రమాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం రెవెన్యూ, పోలీసు అధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. అగ్రిగోల్డ్‌ బాధితులకు అండగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు ఎంత పలుకుబడి ఉన్న వారైనా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కాకాణి పర్యటనలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలకు మంచి చేయడమే లక్ష్యం

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- జెండాల ఆవిష్కరణ

వెంకటాచలం: ప్రజలకు మంచి చేయడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేసి జై జగన్‌.. జై కాకాణి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకట శేషయ్య మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని కొనియాడారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు కూటమికి అధికారం ఇస్తే మోసం చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా సర్వేపల్లికి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. నేడు కూటమి పెద్దలు అభివృద్ధిని పక్కనబెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడకుండా, గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీని తిరుగులేని శక్తిగా మార్చేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్‌ కొణిదెన మోహన్‌నాయుడు, జిల్లా నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, మందల పెంచలయ్య, చిట్టమూరు శివకుమార్‌రెడ్డి, అడపాల ఏడుకొండలు, చీకుర్తి నరసయ్య, కడివేటి శివ, మందా కృష్ణ, ఉప్పు అశోక్‌, ముంగర శ్రీనివాసులు, తాటిపర్తి సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ వైఎస్సార్‌సీపీదే..

ముత్తుకూరు: భవిష్యత్‌ వైఎస్సార్‌సీపీదేనని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య తదితరులతో కలిసి మాట్లాడారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్‌, ఎంపీటీసీ సభ్యుడు షేక్‌ నవీద్‌, పంటపాళెం సర్పంచ్‌ ఆలపాక శ్రీనివాసులు పాల్గొన్నారు.

- పొదలకూరు: మండల కేంద్రమైన పొదలకూరులో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సర్వేపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ బూత్‌ కమిటీల అధ్యక్షుడు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. దౌర్జన్యాలు చేసే వారి లెక్కలు తేల్చడం జరుగుతుందన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రెక్కల కష్టంపై గతంలో పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 40 శాతం ఓటర్లు వైఎస్సార్‌సీపీకు ఉన్నట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, ఎంపీటీసీలు ఎస్‌కే షాకీరా బేగం, జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, దస్తగిరి, కేతు రామిరెడ్డి, నియోజకవర్గ పార్టీ వీవర్స్‌, అంగన్‌వాడీ వింగ్‌ అధ్యక్షుడు పి.శంకరయ్య, శకుంతలమ్మ, వార్డు సభ్యులు ఎస్‌కే అంజాద్‌, బి.హరి నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, పి.అశోక్‌కుమార్‌రెడ్డి, బి.నారాయణరెడ్డి, వై.పెంచలరెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎన్‌.పెంచలయ్య, దశకంటాద్రిశర్మ, చిన్నపరెడ్డి, కె.అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: కేక్‌ కట్‌ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



పొదలకూరు: పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



ముత్తుకూరు: జెండాను ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పోరాటాలు చేస్తాం

మనుబోలు: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై పోరాటాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మనుబోలు బైపాస్‌రోడ్డు కూడలి వద్ద ఉన్న వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, నాయకులు ముంగర రవీందర్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుంజి రమేష్‌, దాసరి భాస్కర్‌గౌడ్‌, చలగల దయాకర్‌, ఏలూరు భాస్కర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేశారు

తోటపల్లిగూడూరు: సూపర్‌ సిక్స్‌ పథకాలంటూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ ఉప్పల శంకరయ్యగౌడ్‌ పేర్కొన్నారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇస్కపాళెం సెంటర్‌లోని వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరయ్యగౌడ్‌ మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 2019 – 24 మధ్య ప్రజారంజక పాలన సాగించారన్నారు. అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందినట్లు చెప్పారు. అయితే నేటి కూటమి పాలన కక్ష సాధింపు చర్యలు, అరాచకాలతో సాగుతోందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం, నెల్లిపూడి సునీల్‌కుమార్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్‌, తిరవళ్లూరు ఈశ్వరయ్య, తాని తిరుపతి, ఎంబేటి సంధ్యారాణి, కాయల మణి, తిరవళ్లూరు వెంకటేశ్వర్లు, పాకం ప్రవీణ్‌కుమార్‌, శేషు, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: నినాదాలు చేస్తున్న నాయకులు



టీపీగూడూరు: వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పనిఒత్తిడి తగ్గించాలి

- సచివాలయ సెక్రటరీల వినతి

పొదలకూరు: పనిఒత్తిడి తగ్గించాలని మండలంలోని సచివాలయాల సెక్రటరీలు బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సాయిప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇతర ప్రభుత్వ శాఖలతో పోల్చి చూస్తే తమకు విపరీతమైన పనిఒత్తిడి ఉందన్నారు. గ్రామ స్థాయిలో అన్ని శాఖలకు సంబంధించి సమన్వయం చేసుకుని పనిచేయాల్సి వస్తున్నట్టు వెల్లడించారు. ప్రధానంగా గ్రామాల్లో చెత్త తొలగింపు, మంచినీటి సరఫరా, వీధిలైట్లు తదితర అవసరాలను తీర్చాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ పాలన వరకు పరిమితం చేయాల్సిందిగా కోరారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సెక్రటరీలు

శాస్త్రవేత్తల సూచనలతో నాణ్యమైన దిగుబడి

కొడవలూరు: శాస్త్రవేత్తల సూచనలను పాటించి వరిని సాగుచేస్తే నాణ్యమైన దిగుబడొస్తుందని ఏపీ సీడ్‌ సర్టిఫికెషన్‌ ఏజెన్సీ తనిఖీ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామన్నపాళెంలో పొలంబడి కింద సాగు చేసిన వరి పంట దిగుబడిని బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తల సూచనలతో వరిని సాగుచేస్తే పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. నాణ్యమైన దిగుబడితో మార్కెట్లో మంచి ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కోవూరు ఏడీఏ సుజాత, వీఏఏ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

- కోవూరు: పురుగుమందులను విచక్షణారహితంగా వాడకుండా సిఫార్సు మేరకే వినియోగించాలని ఏపీ సీడ్‌ సర్టిఫికెషన్‌ ఏజెన్సీ తనిఖీ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగవరంతో పాటు అన్ని గ్రామాల్లో పొలంబడి క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు చాద్విక, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు ఆశీర్వాదం

ఇందుకూరుపేట: జగదేవిపేటకు చెందిన వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నేతలు పిడూరు సునీల్‌కుమార్‌రెడ్డి, చంద్రసేన దంపతుల కుమార్తె సాయిచైత్ర, మనోజ్‌ కుమార్‌రెడ్డి వివాహాన్ని నెల్లూరులోని అనిల్‌ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సతీమణి గీతారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్‌ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్డీఏ చైర్మన్‌ గొల్లపల్లి విజయ్‌కుమార్‌, నేతలు బట్టేపాటి నరేంద్రరెడ్డి, షబ్బీర్‌ తదితరులు పాల్గొన్నారు.



షాదీమంజిల్‌ను అభివృద్ధి చేయాలి

కోవూరు: మండలంలోని షాదీమంజిల్‌ను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ డిమాండ్‌ చేశారు. పడుగుపాడు పంచాయతీలో బుధవారం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. షాదీమంజిల్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. నేతలు గండవరపు శేషయ్య, సర్దార్‌ అహ్మద్‌, ఎస్కే బాబు, అఫ్రోజ్‌, చాంద్‌బాషా, ఫాతిమా, యస్దానీబాషా, ఉటుకూరు వెంకటరమణయ్య, కొమరగిరి శ్రీనివాసులు, గండవరపు సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

పాఠశాలలో సరస్వతి పూజ

పొదలకూరు: పట్టణంలోని నాగార్జున స్కూల్లో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్‌ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కరస్పాండెంట్‌ సునీతారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ లక్ష్మీదుర్గ, జీఎస్‌ రెడ్డి, చంద్రశేఖర్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

యువత పోరుకు తరలిన నాయకులు

పొదలకూరు: జిల్లా కేంద్రమైన నెల్లూరులో నిర్వహించిన యువత పోరుకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు బుధవారం తరలివెళ్లారు. సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపుమేరకు పెద్దఎత్తున వెళ్లి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పొదలకూరు: సోమశిల – పొదలకూరు మార్గం ఆర్‌వైపాళెం గ్రామ ఎస్సీ కాలనీ వద్ద బుధవారం మోటార్‌బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా అడ్డొచ్చిన పందిని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. కలువాయి మండలం తెలుగురాయపురం గ్రామానికి చెందిన బి.రవి బైక్‌పై వెళ్తుండగా మెయిన్‌ రోడ్డుపై పందిని ఢీకొన్నారు. దీంతో కింద పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్‌ సిబ్బంది అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్పీఐ బలోపేతానికి కృషి

కోవూరు: రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా (ఆర్పీఐ) బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ జిల్లా అధ్యక్షుడు మిరియాల వెంకటరమణయ్య తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఆర్పీఐ ఉమ్మడి నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నెల్లూరులోని అంబేడ్కర్‌ భవన్‌లో ఇటీవల నిర్వహించారని చెప్పారు. పార్టీ బలోపేతానికి సమావేశాలను నిర్వహించనున్నామని వెల్లడించారు.

క్రీడా సామగ్రి అందజేత



విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్‌ – వీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు క్రీడా సామగ్రిని నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. షటిల్‌, వాలీబాల్‌, క్యారమ్స్‌, చెస్‌ కిట్లను కేంద్ర ప్రతినిధి దాసరి శరవణ చేతుల మీదుగా ప్రిన్సిపల్‌ సుజాతకు ఇచ్చారు. వైస్‌ ప్రిన్సిపల్‌ మధు, కళాశాల క్రీడా విభాగ కన్వీనర్‌ ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్‌ అసోసియేషన్‌ నేతలతో సమావేశం

నెల్లూరు(అర్బన్‌): ప్రకాశం జిల్లా రైస్‌మిల్లర్స్‌ అసోసియేషన్‌ నేతలతో సమావేశాన్ని జేసీ కార్తీక్‌ తన చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు పండిస్తున్న ధాన్యాన్ని అవసరం మేరకు ప్రకాశం జిల్లా మిల్లర్లకు తరలిస్తామని చెప్పారు. దీనికి సహకరించి బ్యాంక్‌ గ్యారెంటీలను ఇవ్వాలని కోరారు. తమ వంతు సహకారం అందిస్తామని మిల్లర్లు హామీ ఇచ్చారు. పౌరసరఫరాల జిల్లా అధికారి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వనరులను వినియోగించుకోవాలి : వీసీ

వెంకటాచలం: స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో బుధవారం కమ్యూనిటీ ఆధారిత పునరావాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో కమ్యూనిటీ ఆధారిత విధానాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. పునరావాసం ద్వారా బాధితులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించవచ్చని తెలియజేశారు. స్థానిక వనరులను ఉపయోగించుకుంటూ బాధితులకు స్థిరమైన జీవితాన్ని అందించేందుకు ఈ విధానాలు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కె.సునీత, ప్రిన్సిపల్‌ సీహెచ్‌ విజయ, సోషల్‌ వర్క్‌ విభాగాధిపతి డాక్టర్‌ మధుమతి, డాక్టర్‌ ఆర్‌.ప్రభాకర్‌, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

పశు సంరక్షణపై శిక్షణ

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో అదానీ ఫౌండేషన్‌ – పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశు సంరక్షణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డీడీ డాక్టర్‌ నాగమణి మాట్లాడుతూ వేసవి కాలం ప్రవేశించిన నేపథ్యంలో పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచాలన్నారు. వ్యాధులు, పోషణలో సందేహాలుంటే పశువైద్యుల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముత్తుకూరు ఏడీ డాక్టర్‌ నిర్మల, పశువైద్యులు డాక్టర్‌ రాజ్యలక్ష్మి, ఫౌండేషన్‌ హెడ్‌ రాజేష్‌ రంజన్‌, డాక్టర్‌ సెల్వరాజన్‌, షాహుల్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెటర్నరీ డీడీ నాగమణి

మోహినీ అవతారంలో ప్రసన్నుడు

- జ్ఞానామృతాన్ని పంచుతూ సాగిన గ్రామోత్సవం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన మోహినీ ఉత్సవం కనులపండువగా జరిగింది. దేవ,దానవులతో పాటు కిన్నెర కింపురుషాది గంధర్వులను సైతం మోహంలో పడేసే దివ్య సౌందర్య సమ్మోహన రూపంతో ప్రసన్న వేంకటేశ్వరుడు జగన్మోహినీ అవతారంలో భక్తులను మంత్రముగ్ధులను చేశాడు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలకు నాందీగా స్వామివారు మోహినీ అవతారంలో పండితుల వేదమంత్రాలు, శుభకర మేళతాళాలు, గోవింద నామస్మరణలను ఆస్వాదిస్తూ కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల్లో ఊరేగారు. వేకువనే ఆలయ అర్చక బృందం జగన్మోహినీ అవతారంలోని ప్రసన్నునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టు పీతాంబరాలతో అలంకరించిన ఏకదంత పల్లకిలో కొలువుదీర్చారు. మరోమారు పూజలు, భక్తుల దర్శనానంతరం గోవింద నామస్మరణల మధ్య స్వామివారు పాలకడలి నుంచి ఆవిర్భవించిన అమృతభాండంతో భక్తులకు జ్ఞానామృతాన్ని పంచుతూ గ్రామోత్సవానికి బయలుదేరారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మోహినీ అవతారంలోని స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రసన్న వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

వెంగమాంబ సన్నిధిలో బహిరంగ వేలం పాటలు

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో వివిధ హక్కులకు దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాటలను బుధవారం నిర్వహించారు. నర్రవాడకు చెందిన సంకతాల ప్రభావతి కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయ హక్కును రూ.28.1 లక్షలు, అమ్మవారి చీరలు, రవికల సేకరణ, విక్రయ హక్కును రూ.7.54 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే పి.సుశీల పొంగళ్ల షెడ్‌, గ్యాస్‌ పొయ్యిలు అద్దెకు ఇచ్చే హక్కును రూ.1.25 లక్షలకు, పత్తి సుబ్రహ్మణ్యం పండ్లు, పూలు విక్రయ హక్కును రూ.4.73 లక్షలు, బాబు పాదరక్షలు భద్రపరుచుకునే హక్కును రూ.12,200కు దక్కించుకున్నారు. సర్పంచ్‌ నాగయ్య, కొరుటూరు గ్రూపు దేవస్థానాల ఈఓ కవిత, వెంగమాంబ ఆలయ ఈఓ ఉషశ్రీ, వ్యవస్థాపక ధర్మకర్తలు పచ్చవ కరుణాకర్‌, పచ్చవ వెంగయ్య, వేమూరి ముసలయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హుండీల కానుకల లెక్కింపు

వెంగమాంబ అమ్మవారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.



వేలం నిర్వహిస్తున్న దృశ్యం